సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 9 । జూన్ । 2024



భవన నిర్మాణానికి కృషి

ఆమనగల్లు పట్టణంలో కోర్టు భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి హామీ ఇచ్చారు. 8లో▸



శ్రీలతకు రివార్డు

కొత్త చట్టాలపై ఇచ్చిన ప్రజెంటేషన్ బాగుండడంతో కానిస్టేబుల్ శ్రీలతకు డీసీపీ సునీతారెడ్డి రివార్డు అందజేశారు. 8లో▸



కేసులకు పరిష్కారం

రాజీపడి కేసులు పరిష్కరించుకోవాలని ఆమనగల్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కాటం స్వరూప అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపటినుంచి యథావిధిగా ప్రజావాణి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ శశాంక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడంతో ప్రజావాణిని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగిసినందున కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో అవకాశం కల్పించండి

ఉపాధ్యాయ సంఘాల నేతల వినతి



ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న టీచర్లు

కడ్తాల్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ ప్రక్రియలో జిల్లాను మినహాయించడం తగదని.. అన్ని జిల్లాలతో పాటే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారు హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రస్తుతం జరుగుతున్న టీచర్ల బదిలీల, పదోన్నతుల షెడ్యూల్‌లో జిల్లాను మినహాయించడం ద్వారా భవిష్యత్‌లో జరిగే ప్రమోషన్లలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 13 ఏళ్ల నుంచి బదిలీకి నోచుకోక, 2015 నుంచి ప్రమోషన్లు లేక సీనియర్ ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. వచ్చిన ఈ అవకాశాన్ని కొందరు స్వార్థపరులు లాబీయింగ్, కోర్టు కేసులతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వీటన్నంటినీ దృష్టిలో ఉంచుకుని జిల్లాను కూడా ఈ షెడ్యూల్‌లోనే చేర్చి బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణరెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్‌-1 ప్రిలిమినరీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో ఆదివారం జరిగే గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్షకు 1,65,988 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందుకోసం 275 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఉదయం 9 గంటల లోపు చేరుకోవాల్సిఉంటుంది. 10 గంటల వరకు అనుమతించి బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారు. ఆ తర్వాత గేట్లు మూసి వేసి అభ్యర్థులను అనుమతించరు.

విద్యుత్ వినియోగం తగ్గుముఖం

సాక్షి, సిటీబ్యూరో: నిన్నా మొన్నటి వరకు భగ్గున మండిన ఎండలు.. క్రమంగా తగ్గుముఖం పట్టాయి. రుతుపవనాల రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రోజంతా ఆన్‌లోనే ఉన్న ఏసీలు, కూలర్లు ఒక్కొక్కటిగా ఆఫ్ అవుతున్నాయి. ఫలితంగా కరెంట్ వినియోగం తగ్గుముఖం పట్టింది. మే 31న 90 మిలియన్ యూనిట్ల వరకు నమోదైన కరెంట్ వినియోగం .. తాజాగా శనివారం 71 ఎంయూలకు పడిపోయింది. సామర్థ్యానికి మించి విద్యుత్ డిమాండ్ నమోదవుతుండటంతో సబ్‌స్టేషన్లు ఒకానొక దశలో వణికిపోయాయి. తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండేవి. ఇంజినీర్లు అప్రమత్తమై సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు చర్యలు చేపట్టాల్సి వచ్చింది. మూడు నెలల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిన వినియోగం తొలకరి జల్లులతో తాజాగా తగ్గుముఖం పట్టి ఇంజినీర్లకు ఉపశమనం కల్పించింది.



యాచారం: మాల్ మార్కెట్లో రద్దీ



చేవెళ్ల: చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు



ఇబ్రహీంపట్నం: చేపలు కొనుగోలు చేస్తున్న జనం



కందుకూరు: మార్కెట్‌లో చేపల విక్రయం

ఫిష్.. రష్

మృగశిర కార్తె సందర్భంగా శనివారం చేపలకు భలే డిమాండ్ పలికింది. ఉదయం నుంచే జనాలు చేపల కొనుగోలుకు క్యూ కట్టారు. మార్కెట్లన్నీ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దీంతో ఒక్కసారిగా బొప్పలు, బంగారు తీగ, కొర్రమట్టలు, రవ్వలు, బోత్స తదితర చేపలకు డిమాండ్ ఏర్పడింది. సాధారణ రోజుల్లో కిలో రూ.150 వరకు ధర పలికితే మృగశిర కావడంతో రూ.300 వరకు విక్రయించారు.


అయ్యో భౌబోయ్

ఏటా పెరుగుతున్న శునకాల సంఖ్య

నియంత్రణ చర్యలు శూన్యం

అధికమవుతున్న కుక్కకాటు కేసులు

విజృంభిస్తున్న వీధి కుక్కలు





ఇటీవల తుర్కయంజాల్‌లో కుక్కల దాడిలో గాయపడిన బాధితులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. దారిన వెళ్లేవారిపై దాడి చేస్తూ కండలు పీకేస్తున్నాయి. కుక్కకాటు కేసుల సంఖ్య అంతకంతకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో గత ఏడాది జనవరి నుంచి మే వరకు 2,731 కుక్కకాటు కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 2,006 కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని మణికొండ, నార్సింగి, తుక్కుగూడ, బండ్లగూడ జాగీర్, తుర్కయంజాల్, పెద్ద అంబర్‌పేట్, శంషాబాద్, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, షాద్‌నగర్, శంకర్‌పల్లి, మీర్‌పేట్, బడంగ్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగింది. చిన్నారులు, వృద్ధులు, వాహనదారులను వెంటపడి మరీ కరిచేస్తున్నాయి. గొర్రెలు, మేకలు, పశువులపై ముప్పేట దాడికి పాల్పడుతున్నాయి. వాటి ధాటికి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఎప్పటికప్పుడు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు వాటిపై దృష్టి పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సిటీలో పట్టి.. శివారులో వదిలి

ఎంసీహెచ్ పరిధిలో దాదాపు లక్షన్నర కుక్కలుండగా, జీహెచ్ఎంసీగా మారి విస్తీర్ణం పెరగడం.. శివారు ప్రాంతాల్లోకి పొరుగు జిల్లాల నుంచి కుక్కలు వలస రావడంతో ప్రస్తుతం వీటి సంఖ్య 7.58 లక్షలు ఉన్నట్లు అంచనా. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు (స్టెరిలైజేషన్) చేసేందుకు ఆటోనగర్, అంబర్‌పేట, చుడీబజార్, జీడిమెట్ల, పటాన్‌చెరులో కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో ఏటా 80 వేల కుక్కలకు టీకాలు వేస్తున్నారు. నెలకు రెండు వేల కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. అయినా వీటి సంఖ్య తగ్గకపోగా.. శివారు మున్సిపాలిటీల్లో మరింత పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కోర్‌సిటీలో పట్టిన కుక్కలను ఔటర్ అవతల ఉన్న నిర్మానుష్య ప్రాంతాల్లో వదులుతున్నారు. ఆకలితో చెత్తకుప్పల్లో కుళ్లిపోయిన ఆహారపదార్థాలు తిని పిచ్చిపట్టిన వాటిలా వ్యవహరిస్తున్నాయి. గ్రామాల్లోకి చొరబడి వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులు, ఇళ్ల ముందు నిద్రిస్తున్న వృద్ధులు, రోడ్ల వెంట వచ్చి పోయే వాహనదారులపై దాడి చేస్తున్నాయి. మైదాన ప్రాంతాల్లో మేతకు వెళ్లిన గొర్రెలు, మేకలు, పశువులపై పంజా విసురుతున్నాయి.

అత్యధికంగా ఔటర్ చుట్టూ

గ్రేటర్ జిల్లాల్లో సుమారు ఏడు లక్షలకుపైగా వీధి కుక్కలుండగా, వీటిలో మెజార్టీ జిల్లాలోనే ఉన్నాయి. వెటర్నరీ విభాగం ఏటా దాదాపు 80 వేల కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేస్తున్నప్పటికీ వీధుల్లోని కుక్కలు మాత్రం తగ్గడం లేదు. అత్యధికం ఔటర్ రింగ్ రోడ్డుకు అటు, ఇటుగా విస్తరించిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనే ఉండటం గమనార్హం.

- సాధ్యమైనంత వరకు వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతంలో తిరగకపోవడమే మంచిది.
- ఒకవేళ కుక్క కరిస్తే వెంటనే ధారగా కారుతున్న నీటితో 10 నుంచి 15 నిమిషాల పాటు శుభ్రం చేయాలి.
- రక్తం కారుతున్నా గాయంపై కట్టు కట్టకూడదు. మట్టి, పసుపు, ఆకుపసరు వంటివి పోయకూడదు.
- ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి.
- కరిచిన తర్వాత ఒకటి, ఆ తర్వాత 3, 7, 14, 28 రోజుల్లో విధిగా వ్యాక్సిన్ వేసుకోవాలి. లేదంటే రేబిస్ సోకుతుంది.
- ఈ వైరస్ కాలు నుంచి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రోజుకు అర సెంటిమీటర్ చొప్పున పైకి ఎగబాకుతుంది. ఇది నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

లక్షణాలు, సూచనలు

- తొలిదశలో జ్వరం, తలనొప్పి, వాంతులు కనిపిస్తాయి. రెండో దశలో పిచ్చిగా ప్రవర్తించడం, మనుషులను గుర్తించలేక పోవడం, నోరులోంచి నురుగు రావడం, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటివి కనిపిస్తాయి.
- ఇక మూడో దశలో పూర్తిగా కోమాలోకి వెళ్లి, రెండు మూడు రోజుల్లో మృత్యువాత పడుతుంటారు.
- ఇంట్లో ఉన్న కుక్కలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పని సరిగా వ్యాక్సిన్ వేయించాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

దోపిడీ దొంగల అరెస్ట్

ఒకరిపై 87, మరొకరిపై 60 కేసులు

- కళ్లలో కారం చల్లి దోచుకోవడమే లక్ష్యం
- వివరాలు వెల్లడించిన డీసీపీ

పహాడీషరీఫ్: ఇద్దరు ఘరానా దొంగలను అరెస్టు చేసిన పహాడీషరీఫ్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఒకరిపై 87, మరొకరిపై 60 కేసులు నమోదై ఉండడం గమనార్హం. వీరినుంచి రూ.2.47 లక్షల విలువైన 8తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలతో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు.

దారి దోపిడీలే లక్ష్యం

మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన టక్ సంషేర్ సింగ్(36) కుటుంబంతో కలిసి జవహర్‌నగర్ పీఎస్ పరిధిలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. నిజామాబాద్ జిల్లా కానాపూర్‌కు చెందిన దొండ్ల బాబు అలియాస్ బాబు బాలాజీ గైక్వాడ్(41) కొంపల్లిలో ఉంటున్నాడు. ఇటీవలే జైలు నుంచి విడుదలైన బాబు తన పాత స్నేహితుడైన సంషేర్ సింగ్‌తో కలిసి నగర శివారుల్లో దోపిడీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ కలిసి గత ఫిబ్రవరిలో పటాన్‌చెరు పీఎస్ పరిధిలో పైన్ బైక్(ఏపీ 39 ఎఫ్‌జెడ్ 8981)ను దొంగిలించారు. దీనిపై తిరుగుతూ నిర్మానుష్య ప్రాంతాల్లో దొరికిన వారిని లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇలా మహేశ్వరం జోన్ పరిధిలో మూడు, నల్లగొండలో ఒక చోరీ చేశారు. మరో దాడికి సిద్ధమైన వీరిని పహాడీషరీఫ్ పరిధిలో పట్టుకున్నారు.

తల్లీకూతుళ్ల ప్రతిఘటనతో..

తుక్కుగూడ అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో గత మే 24న ఆరుగురు చిన్నారులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న మంఖాల్ గ్రామానికి చెందిన గడ్డమీది కల్పనను లక్ష్యంగా చేసుకుని ఇద్దరూ దోపిడీకి ప్రయత్నించారు. బైక్‌పై వచ్చి కల్పన కళ్లల్లో కారం నీళ్లు చల్లి ఆమె మెడలోని మంగళసూత్రాన్ని లాక్కున్నారు. వెంటనే తేరుకున్న కల్పన, ఆమె కూతురు లక్ష్మీప్రసన్న దుండగులతో తలపడ్డారు. బైక్ తాళాలు లాక్కుని, గట్టిగా కేకలు వేడయంతో ద్విచక్రవాహనంతో పాటు బ్యాగ్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. వీటి ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

కల్లు తాగుతావా తాతా..

అంతకుముందు ఏప్రిల్ 14న కూడా ఇదే తరహాలో మహేశ్వరం ఠాణా పరిధిలో 72 ఏళ్ల వయసున్న ఓ గొర్రెల కాపరి వద్దకు వెళ్లిన సంషేర్ సింగ్, బాబు.. కల్లు తాగుతావా తాతా అంటూ అతన్ని మాటల్లో దించి వెంట తెచ్చుకున్న కారం నీళ్లను కళ్లలో చల్లి చేతికి ఉన్న వెండి కడియాలు, చెవి పోగును లాక్కెళ్లారు. ఇది జరిగిన ఆరు గంటల వ్యవధిలోనే కందుకూరు పీఎస్ పరిధిలోని రాచులూర్ వద్ద సాయంత్రం వేళ ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ కళ్లలో కారం నీళ్ల చల్లి బంగారు మంగళ సూత్రాన్ని లాక్కొని ఉడాయించారు. ఈ దోపిడీలపై రాచకొండ సీపీ తరుణ్ జోషి ఆదేశానుసారం డీసీపీ సునీతారెడ్డి ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దింపారు. ఈ క్రమంలోనే మరోసారి దోపిడీ ప్రయత్నాల్లో ఉన్న నిందితులను పట్టుకున్న పోలీసులు శనివారం వారిని అరెస్ట్ చేశారు. తుక్కుగూడలో దొంగతనం చేసిన అనంతరం నల్లగొండ రూరల్ ఠాణా పరిధిలో కూడా మహిళ మెడలో ఇదే రకంగా బంగారు మంగళసూత్రాన్ని చోరీ చేసినట్లు విచారణలో తేలింది.

ఇరువురిపైనా పీడీ యాక్ట్

సంషేర్ సింగ్ మొదట కామారెడ్డి జిల్లాకు వలస వచ్చాడు. నిజామాబాద్ వాసి అయిన దొండ్ల బాబుతో ఏర్పడిన పరిచయంతో చోరీల బాట పట్టారు. పలు కేసుల్లో అరెస్టయి జైలు నుంచి విడుదలైన నిందితులు 2018 నుంచి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేయడం ప్రారంభించారు. అనంతరం 2019లో కామారెడ్డి ఎస్పీ వీరిద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. విడుదలైన అనంతరం ఇద్దరూ కలిసి తూప్రాన్, బిక్నూర్, నాగిరెడ్డి పేట్, పాపన్నపేట, జోగిపేట ప్రాంతాల్లో తన సోదరులు కుల్జీత్ సింగ్, బల్జీత్ సింగ్‌లతో కలిసి పలు దోపిడీలకు పాల్పడ్డారు. ఇలా సంషేర్‌సింగ్‌పై ఏకంగా 87 కేసులు నమోదు కాగా.. 44 కేసుల్లో పరారీలో ఉన్నాడు. మరో నిందితుడైన బాబుపై 60 కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. సమావేశంలో పహాడీషరీఫ్, మహేశ్వరం ఇన్‌స్పెక్టర్లు పి.గురువారెడ్డి, వెంకటేశ్వర్లు, పహాడీషరీఫ్ డీఐ సుధీర్ కృష్ణ, ఎస్సైలు వెంకటేశ్వర్లు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

చంపేస్తాడని.. చంపేశాడు

- పాత కక్షల నేపథ్యంలో బావమరిదిని హత్య చేసిన బావ
- మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
- మృతుడు, హతుడు ఇద్దరూ పాత నేరస్తులే..

మీర్‌పేట: పాత కక్షల నేపథ్యంలో పథకం ప్రకారం బావమరిదిని హత్య చేసిన ఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందనవనానికి చెందిన షభానాబేగం కుమారుడు సల్మాన్ (25) పలు కేసుల్లో నిందితుడు. దీంతో పోలీసులు అతనిపై పీడీయాక్ట్ నమోదు చేసి జైలుకు పంపారు. ఇదే ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు దాసరి సురేందర్ (32).. సల్మాన్ చెల్లి ఫాతిమాబేగంను 2021లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాది తర్వాత ఆమెను భవనం పైనుంచి తోసి చంపేశాడు. దీంతో సురేందర్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతన్ని జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో సల్మాన్, సురేందర్ మధ్య వైరం పెరిగింది. ఇద్దరూ జైలులో ఉండగా సైతం తరచూ గొడవ పడేవారు. రెండు నెలల క్రితం (పది రోజుల తేడాలో) ఇద్దరూ జైలు నుంచి బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా సల్మాన్ పెద్దనాన్న కూతురు స్వర్ణలతతో సురేందర్ సన్నిహితంగా ఉంటున్నాడు. అప్పటికే తన చెల్లిని చంపాడని రగిలిపోతున్న సల్మాన్ బతికిఉంటే తనకు ప్రమాదమని భావించిన సురేందర్ బావమరిదిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటల తర్వాత స్వర్ణలత ద్వారా సల్మాన్‌కు ఫోన్ చేయించి టీకేఆర్ కమాన్ సమీపంలోని నిర్జన ప్రదేశంలోకి రప్పించాడు. వచ్చీరాగానే సురేందర్ అతనిపై కత్తితో విరుచుకుపడ్డాడు. గొంతుతో పాటు శరీరంపై దాడి చేయడంతో సల్మాన్ అక్కడికక్కడే కూలిపోయాడు. విషయం తెలుసుకున్న సల్మాన్ తమ్ముడు అర్బాజ్ వెంటనే అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి షభానాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సురేందర్‌తో పాటు అతని అనుచరులు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు. సల్మాన్ తల్లి ముస్లిం కాగా తండ్రి హిందువు అని పోలీసులు తెలిపారు.



హత్యకు గురైన సల్మాన్ (ఫైల్)

కలిసి బతకలేమని..

జీడిమెట్ల, జగద్గిరిగుట్ట: వారిద్దరూ ప్రేమించుకున్నారు.. జీవితాంతం కలిసి ఉండాలని బాసచేసి పెళ్లి చేసుకున్నారు.. వీరి కాపురం కొన్నాళ్లు సాఫీగానే సాగింది. ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఏం జరిగిందో ఏమో భార్య హెచ్ఏఎల్‌లోని తల్లి గారింట్లో, భర్త చింతల్ హెచ్ఎంటీలో ఒకేరోజు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. జీడిమెట్ల, జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీకి చెందిన కృష్ణమూర్తి చిన్న కుమారుడు మంచూరి రేశ్వంత్ (26), గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీకి చెందిన సాయిశ్రేయ (22)ను ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. అనంతరం గాజులరామారం ద్వారకా నగర్‌లో కాపురం పెట్టారు. రేశ్వంత్ బిగ్‌బాస్కెట్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కొన్నాళ్లు దంపతులిద్దరూ బాగానే ఉన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. శనివారం రేశ్వంత్ హెచ్ఎంటీ నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు చున్నీతో ఉరి వేసుకుని మృతిచెందాడు. సాయిశ్రేయ హెచ్ఏఎల్ కాలనీలోని తల్లిగారింట్లో ఉరి వేసుకుని మృతిచెందింది. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బండరాయితో మోది.. ముళ్లపొదల్లో పడేసి..

వ్యక్తి దారుణ హత్య

- ముగ్గురు నిందితుల అరెస్టు
- వివాహేతర సంబంధమే కారణం..!



సనత్‌నగర్: బేగంపేట అల్లంతోటబావిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. తలపై బండరాయితో మోది ముళ్లపొదల్లో పడవేసి నిందితులు పరారయ్యారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసులు తేల్చారు. బేగంపేట పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆ ప్రాంతానికి చెందిన అన్నామలై అయ్యప్ప(40)కు గత పదేళ్ల క్రితం గాయత్రి అనే యువతితో వివాహమయ్యింది. అయ్యప్ప సికింద్రాబాద్ పార్క్‌లైన్‌లోని ఓ ప్రింటర్ షాపులో పనిచేస్తున్నాడు. ఉదయం 9.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రాత్రి 10 గంటలకు తిరిగి వస్తుంటాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే శుక్రవారం కూడా విధులకు వెళ్లాడు. కాగా భార్య గాయత్రికి రాత్రి 8 గంటల సమయంలో స్థానికులు ఓ వార్తను చేరవేశారు. అల్లంతోటబావి ఆర్‌కే టవర్స్ వెనుక ముళ్ల పొదల్లో అయ్యప్ప రక్తపుమడుగులో పడున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో హుటాహుటిన ఆమె అక్కడికి చేరుకున్నారు. భర్త పరిస్థితిని చూసిన ఆమె వెంటనే స్థానికుల సహాయంతో 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో క్షతగాత్రుడు అయ్యప్పను గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. పరిస్థితి విషమించి అయ్యప్ప అర్ధరాత్రి 1.22 గంటలకు మృతి చెందాడు. అయ్యప్ప భార్య గాయత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటుచేశారు.

24 గంటలు గడవకముందే అరెస్టు..

భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. సెల్‌ఫోన్ ఆధారంగా ఎవరెవరితో అయ్యప్ప మాట్లాడాడు, ఎవరిపై అనుమానాలు ఉన్నాయనే అంశాలను పరిశీలించారు. దీంతో నేరుగా నిందితుల ఇళ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. అదే ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్లు కొమ్మల సంతోష్ అలియాస్ సంతు (34), సయ్యద్ రజా (37), ప్రైవేటు ఉద్యోగి గొర్ల హర్షవర్ధన్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా, హత్య విషయాన్ని ఒప్పుకున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని..

హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసుల విచారణలో తేలింది. నిందితుల్లో ఒకరైన కొమ్మల సంతోష్ భార్య సాయికన్యకు హౌస్ కీపింగ్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ అయ్యప్ప ఆమెతో చనువుగా ఉండేవాడు. ఆ చనువు కాస్తా శారీరక సంబంధానికి దారితీసింది. విషయం తెలుసుకున్న సంతోష్ పలుమార్లు భార్యను హెచ్చరించడంతో పాటు అయ్యప్పకూ వార్నింగ్ ఇచ్చాడు. అయ్యప్పను అంతమొందించాలని పథకం వేసిన సంతోష్ తన స్నేహితులు సయ్యద్ రజా, హర్షవర్ధన్‌ల సహాయం కోరాడు. వీరంతా శుక్రవారం సాయంత్రం మద్యం సేవించి అయ్యప్పను కలుసుకుని మద్యం సేవించాలని పట్టుబట్టారు. అయితే తాను మద్యం సేవించనని చెప్పడంతో అయ్యప్పతో వాగ్వాదానికి దిగారు. ఆవేశంతో సంతోష్ గ్రానైట్ రాయితో అయ్యప్పతలపై పలుమార్లు మోది హత్య చేశాడు.

కోర్టు భవన నిర్మాణానికి కృషి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: పట్టణంలో కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం సేకరించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ సభ్యులు కసిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పట్టణంలో కొనసాగుతున్న కోర్టు భవనం శిథిలావస్థలో ఉందని.. నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. భవన నిర్మాణానికి అనువైన స్థలం చూసి కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఆమనగల్లు మున్సిపల్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు యాదవ్, సీనియర్ న్యాయవాది లక్ష్మణశర్మ, యాదీలాల్, న్యాయవాదులు సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ, శేఖర్, కృష్ణ, మధు, సంతోశ్,గణేశ్, మల్లేశ్, దేవేందర్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కేవీపీని కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

మాజీ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కేవీపీ రామచంద్రారావును శనివారం ఆమనగల్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని కేవీపీ నివాసంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురభి వెంకటేశ్వరరావు, సురేందర్‌రెడ్డి తదిరతులున్నారు.



కేవీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కానిస్టేబుల్ శ్రీలతకు రివార్డు



రివార్డు అందజేస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం: కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించేందుకు వారం రోజులుగా గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ క్రైమ్ ఉమెన్ కానిస్టేబుల్ శ్రీలత ఇచ్చిన ప్రజెంటేషన్ పలువురు పోలీస్ అధికారులు ప్రశంసించారు. శనివారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి శ్రీలత ప్రజంటేషన్‌కు రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ జగన్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న జగన్

ఆమనగల్లు: ప్రజారోగ్య బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ జగన్ డాక్టరేట్ పట్టా అందుకున్నాడు.మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జగన్ ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పేరిట జరిగే మోసాలను నివారించడంలో ముందున్నారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడిగా, అడ్వకేట్‌గా పేదలకు సేవలందించారు. ఆయన సేవలను గుర్తించిన హర్యానాలోని వాషింగ్టన్ డిజిటల్ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా అందించింది. ఈ మేరకు జగన్‌ను పలువురు అభినందించారు.

పాడి ఆవు మృతి



ఆవు కళేబరం

కేశంపేట: పశువుల కొట్టంలోని గాడిలో పడి పాడి ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నారాయణచారి పాడిపరిశ్రమ పైన ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం రాత్రి పాడి ఆవును తన వ్యవసాయ పొలంలో తాడుతో కట్టేసి వచ్చాడు. శనివారం ఉదయం వెళ్లి చూడగా ఆ ఆవు పాకలోని గాడిలో పడి మృతి చెందింది. పేదవాడినైనా తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

షాబాద్/మహేశ్వరం: పేకాట ఆడుతున్న ఆరుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ మధు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి రంగనాయకుల కాలనీకి చెందిన దాసరి శ్రీశైలం, పల్లపు సురేశ్, ఒరుసు అజయ్‌కుమార్, కేతావత్ రాజు, ముడావత్ నరేశ్, పత్లావత్ రమేశ్ శుక్రవారం రాత్రి పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద రూ.8,100 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

1,392 కేసులకు పరిష్కారం



మెజిస్ట్రేట్ స్వరూప ఆధ్వర్యంలో కొనసాగుతున్న లోక్ అదాలత్

ఆమనగల్లు: రాజీపడి కేసులను పరిష్కరించుకుంటే ఇరువర్గాలు గెలిచినట్లేనని ఆమనగల్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కాటం స్వరూప అన్నారు. శనివారం పట్టణంలోని ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల పోలీసు స్టేషన్ పరిధిలోని 1,392 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఏపీపీ కార్తీక్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్, మాడ్గుల సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్, ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాంనాయక్, న్యాయవాదులు ఆంజనేయులుయాదవ్, జగన్ తదితరులు ఉన్నారు.

ఎరుకల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం

చిక్కడపల్లి: గత ప్రభుత్వంలో ఎరుకల కులస్తుల సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కాలేదని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించి, పాలక మండలిని ఏర్పాటు చేయాలని కోరారు. తమ వర్గానికి నామినేటెడ్ పదవులు కల్పించాలన్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందడంలేదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎన్పోర స్కీమ్ అమలు చేయాలని కోరారు. ఏకలవ్య భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించలేదన్నారు. తమ సమస్యలపై స్పందించకుంటే కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

రూ.3 లక్షలతో డ్రైవర్ పరార్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–44లోని ఓ హోటల్‌కు వచ్చిన కస్టమర్ కారు నుంచి వ్యాలెట్ పార్కింగ్ డ్రైవర్ రూ.3 లక్షలతో ఉడాయించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ అదనపు ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం రంగస్వామిరెడ్డి అనే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ తన స్నేహితుడితో కలిసి రోడ్డు నెంబర్–44లో ఉన్న వ్యామి శ్రేనా కేఫ్‌కు వచ్చారు. తన కారును వ్యాలెట్ పార్కింగ్‌లో అప్పగించి రాత్రి బయటకొచ్చి చూడగా అక్కడ వ్యాలెట్ పార్కింగ్ డ్రైవర్ కనిపించలేదు. దీంతో ఆయన తన కారు వద్దకు వెళ్లి చూడగా తాళం చెవులు కారులోనే ఉండటాన్ని గమనించారు. ఓ బ్యాగ్‌లో పెట్టిన రూ.3 లక్షల నగదు చోరీకి గురైంది. దీంతో ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆరా తీయగా వ్యాలెట్ పార్కింగ్ డ్రైవర్ రమేష్ నగదుతో ఉడాయించినట్లు గుర్తించారు. నిందితుడు కోసం గాలింపు చేపట్టారు. గ్రీన్ పాచర్ సర్వీసెస్ వ్యాలెట్ పార్కింగ్ నిర్వహిస్తోంది. డ్రైవర్లను నియమించే సమయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని పోలీసులు సూచించారు.

సమతాస్ఫూర్తి కేంద్రం సందర్శన



చినజీయర్‌స్వామితో సంగీత దర్శకుడు ఇళయరాజా

శంషాబాద్ రూరల్: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సమతాస్ఫూర్తి కేంద్రాన్ని శనివారం సందర్శించారు. మండలంలోని ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రం ఆవరణలో నిర్వహించే 'సమతా ఇళయ రాగం' సంగీత కార్యక్రమానికి విచ్చేసిన ఆయన చినజీయర్‌స్వామిని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. సమతాస్ఫూర్తి కేంద్రం విశిష్టతను చినజీయర్‌స్వామి స్వయంగా వివరించారు.